క్లుప్తంగా

పునఃసమీక్షకు దాఖలు చేయాలి



మాట్లాడుతున్న డీటీఎఫ్ నాయకులు

కదిరి అర్బన్: ఉపాధ్యాయ నియామకాలు, పదోన్నతులపై ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో ఉత్తీర్ణత సాధించాలంటూ సుప్రీం కోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం పునఃసమీక్షకు దాఖలు చేయాలని డిస్ట్రిక్ట్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు షర్ఫోద్దీన్, గౌస్‌లాజమ్, మారుతీ ప్రసాద్ తదితరులు బుధవారం కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2010కి ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులందరికీ మినహాయింపునిస్తూ ఎన్‌సీటీఈ మార్గదర్శకాల్లో సవరణ చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తీసుకోవాలన్నారు. లక్షలాది మంది ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించాలన్నారు.

రణభేరికి తరలిన ఉపాధ్యాయులు

కదిరి అర్బన్: విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న గుంటూరులో జరగనున్న యూటీఎఫ్ రణభేరి బహిరంగ సభకు బుధవారం కదిరి నుంచి ఉపాధ్యాయులు తరలివెళ్లారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసులు, తాహిర్‌వలి, మల్లికార్జున, అజంబాషా, సునీల్ కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం సుజాత

ధర్మవరం అర్బన్: కర్నూలులో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు జీవనజ్యోతి పాఠశాల విద్యార్థులు చరణ్, విక్కీ, వరుణ్ పాల్గొననున్నట్లు హెచ్‌ఎం సుజాత తెలిపారు. బుధవారం వీరిని అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా రాణించాలని ఆమె ఆకాంక్షించారు.

సచివాలయ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపల్ సచివాలయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్సిపాలిటీ అధ్యక్షుడిగా సురేంద్రరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా శివశంకర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా అనిత, జాయింట్ సెక్రటరీగా హిదాయత్, ట్రెజరర్‌గా హరినాయక్, జనరల్ సెక్రటరీలుగా మాలిక్, అరుణ, సలహాదారులుగా వెంకటరమణ, అశ్వర్థనారాయణ, శ్రీలత, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సురేష్, హేమలత, రాజేష్, రాజశేఖర్, నరసింహులు, కవిత, నవీన్, మదనగోపాల్ ఎన్నికయ్యారు.

ఉబికి వస్తున్న నీరు



తనకల్లు: నడిమికుంటపల్లి సమీపంలో రైతు శంకర్‌నాయక్ వ్యవసాయ బోరు నుంచి మోటారు వేయకుండానే నీరు ఉబికి వస్తోంది. జన జాగృతి సంస్థ ఆధ్వర్యంలో రాయలసీమ వాటర్ ప్రాజెక్టులో భాగంగా బక్కలకుంట వద్ద చెక్ డ్యాం నిర్మించారు. ఇటీవల కురిసిన వర్షాలకు బక్కలకుంట, చెక్‌డ్యాం నిండి నీళ్లు మరవ పారుతున్నాయి. దీంతో దగ్గర్లో ఉన్న శంకర్‌నాయక్ బోరు కేసింగ్ పైపు నుంచి నీరు వాటంతటవే బయటకు పొంగుతున్నాయి.

కనకాంబరం రైతు కన్నీరు

- విస్తారంగా సాగైన తోటలు
- మార్కెట్‌కు ఎక్కువగా రావడంతో ధరల పతనం
- పెట్టుబడులు రాక లబోదిబోమంటున్న రైతులు

మండలంలో పూల తోటల సాగు (ఎకరాల్లో)

ధర్మవరం	50
బత్తలపల్లి	150
తాడిమర్రి	200
ముదిగుబ్బ	350



యర్రాయపల్లి వద్ద కనకాంబరాలను కోస్తున్న కూలీలు



కొనుగోలుదారులు లేక దుకాణంలో నిల్వ ఉన్న పూలు

బత్తలపల్లి: కనకాంబరం పూల ధరలు దారుణంగా పతనమయ్యాయి. రైతును కోలుకోలేని దెబ్బతీశాయి. గత ఏడాది దిగుబడి తక్కువగా ఉండటంతో మార్కెట్లో ఆశించినస్థాయిలో ధరలు పలికాయి. ఈసారి పరిస్థితి భిన్నంగా మారింది. దిగుబడులు పెరిగిపోవడంతో ధరలు భారీగా తగ్గిపోయాయి. ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లోని పలు గ్రామాల్లో రైతులు దాదాపు 750 ఎకరాల్లో కనకాంబరాలు, మల్లె, జాజి, కాగడాల తోటలు సాగు చేస్తున్నారు. సాధారణంగా ఎకరా కనకాంబరాలు సాగు చేయాలంటే రూ.80 వేల నుంచి రూ.90 వేల వరకు ఖర్చవుతుంది. మల్లె తోటలకు ఎకరాకు రూ.50 వేలు వెచ్చించాలి. అయితే ఈసారి వర్షాభావ పరిస్థితుల వల్ల బోరుబావుల్లో నీరు తగ్గిపోవడంతో.. పూల తోటల రైతులు సమీపంలోని బోరుబావుల్లో నీరున్న వారి నుంచి రోజుకు రూ.1000 అద్దె చొప్పున చెల్లించి తడులు అందించారు. దీనికితోడు కొమ్మ ఎండు తెగులు, వేరుకుళ్లు, వివిధ రకాల పురుగులు ఆశించడంతో అదనంగా మందులు వాడాల్సి వచ్చింది. ఎరువుల ధరలు పెరగడంతో సాగు ఖర్చులు పెరిగాయి.

కనకాంబరం ధర అధఃపాతాళానికి

నియోజకవర్గ వ్యాప్తంగా కోత కోసిన కనకాంబరం పూలను బత్తలపల్లి మార్కెట్‌కు తీసుకొస్తారు. ఇక్కడి నుంచి హైదరాబాద్, చెన్నై, విజయవాడ, చిత్తూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మల్లె, జాజి, కాగడాలు, కనకాంబరం పూలు రోజుకు 3 వేల నుంచి 4 వేల కేజీల వరకు ఇక్కడి నుంచి ఎగుమతి అవుతున్నాయి. అయితే ఈసారి కనకాంబరం పూలకు ధరలు భారీగా తగ్గిపోయాయి. ఇందుకు కారణం ఈసారి పూలు అధికంగా మార్కెట్‌కు రావడమే. గత ఏడాది కిలో కనకాంబరం పూలు రూ.1700 పలికితే ఈసారి రూ.400కు మించడం లేదు.

కూలి ఖర్చులూ రావు



మార్కెట్‌లో కనకాంబరం పూల ధరలు చాలా దారుణంగా పడిపోయాయి. పోయిన సంవత్సరం కిలో రూ.1700 పలికాయి. ఇప్పుడేమో రూ.400 పలుకుతోంది. ఇది ఏమాత్రమూ గిట్టుబాటు కాదు. కూలీల ఖర్చులు కూడా తిరిగి రావడం లేదు. సాగు ఖర్చులు పెరిగాయి. ఇలాంటి పరిస్థితిలో ధరాఘాతంతో కోలుకోలేకపోతున్నాం.

–నాగేంద్ర, రైతు, పూలకుంట, అనంతపురం రూరల్ మండలం

గిట్టుబాటు ధర కల్పించాలి



ఒక ఎకరా విస్తీర్ణంలో కనకాంబరాలు సాగు చేశాను. కూలీలు తగినంతమంది పనులకు రావడంలేదు. కూలీకి రూ.250 ఇస్తున్నాం. ఆటో బాడుగతో కలుపుకొని రూ.300 అవుతుంది. ఇప్పుడేమో పూల ధరలు అమాంతం పడిపోయాయి. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలి.

– కుళ్లాయప్ప, పూల రైతు, యర్రాయపల్లి, బత్తలపల్లి మండలం

పీ-4 సర్వేపై శిక్షణ

బత్తలపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పీ-4 కార్యాక్రమాన్ని విజయవంతం చేయడానికి బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయిలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డివిజనల్ అభివృద్ధి అధికారి జనార్దనరావు హాజరయ్యారు. ఎంపీడీఓ నరసింహానాయుడు అధ్యక్షతన సచివాలయ ఉద్యోగులకు ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహాశర్మ శిక్షణ ఇచ్చారు. జనార్దనరావు మాట్లాడుతూ 45 రోజుల్లో సర్వే పూర్తి చేసి అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ నారాయణరెడ్డి, భారతి, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా పీ-4పై సర్వే నిర్వహించిన గ్రామ సచివాలయ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ సునిత ఆధ్వర్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సర్వేలో సేకరించిన ఆయా కుటుంబాలకు ఆర్థిక, ఆర్థికేతర ప్రాధాన్యత అంశాలను ఎలా గుర్తించాలో ఎంపీడీఓ సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని వివిధ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో గురువారం అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ లక్ష్మీనారాయణ తెలిపారు. రామగిరి 220కేవీ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే విద్యుత్ సరఫరా లైన్ మరమ్మతుల కారణంగా మండలంలోని హరియాన్‌చెరువు, ఎన్ఎస్‌గేట్, వెంకటాంపల్లి, మేడాపురం గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. ప్రజలు, రైతులు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

నారాయణసేవ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సుబ్బదాసు భజన మందిరంలో బుధవారం సత్యసాయి సేవా సమితి సభ్యులు నారాయణసేవ నిర్వహించారు. సేవాసమితి సభ్యులు సాంబశివ, నాగిరెడ్డి, జనార్ధన్, కాకుమాని సాగర్, సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, కేశవ ఆధ్వర్యంలో 600 మందికిపైగా అన్నదానం చేశారు.

ఎన్ఎస్ఎస్‌తో సామాజిక సేవ



వలంటీర్లకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, సెరికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటస్వామినాయక్, చెన్నారెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా సామాజిక బాధ్యత, సమాజసేవ, నిస్వార్థ సేవలు అలవడుతాయన్నారు. పర్యావరణ పరిరక్షణ, గ్రామాల పరిశుభ్రత, మొక్కల పెంపకం తదితర సేవా కార్యక్రమాలు చేసిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గోపాల్‌నాయక్, చిట్టెమ్మ, కిరణ్‌కుమార్, త్రివేణి, షమీవుల్లా, భువనేశ్వరి, హైమావతి, వెంకటలక్ష్మి, పుష్పావతి, ఆనంద్, సరస్వతి, మీనా, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: బుక్కపట్నంలోని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ముష్బూల్ హుస్సేన్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఓబిలేసు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. అధ్యాపకులు శ్రీనివాసులు, దస్తగిరి, భారతి, నాగేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగ్గురు మహిళలపై కేసు

కదిరి టౌన్: భూమి విక్రయానికి సంబంధించి డబ్బు ఇవ్వాలంటూ ప్రిన్సిపాల్‌తో అకారణంగా గొడవకు దిగిన ముగ్గురు మహిళలపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. రెండు రోజుల క్రితం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత ఇంటికి బీజేపీ నాయకురాలు క్రిష్ణవేణమ్మ, ఉమాదేవి, మరొక మహిళ వచ్చారు. భూమి విక్రయంలో తమకు రావాల్సిన డబ్బు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. తానెవరికీ డబ్బు బాకీ లేదని ప్రిన్సిపాల్ తెలిపినా.. వారు పట్టించుకోకుండా గొడవ చేశారు. దీంతో ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు ముగ్గురు మహిళలపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణ రెడ్డి బుధవారం తెలిపారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



మల్లేపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

ఓడీచెరువు: స్త్రీ ఆరోగ్యం బలమైన, శక్తివంతమైన కుటుంబానికి పునాది అని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని వైద్యాధికారి కమల్ రోహిత్ పేర్కొన్నారు. మద్దకవారిపల్లిలో బుధవారం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. స్త్రీలకు ఉచిత వైద్యం, మందులు, వైద్యపరీక్షలు, రెఫరల్ వంటి సౌకర్యాలను ఉపయోగించుకోవాలని వైద్యాధికారి కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ప్రమీల, బిందు భార్గవి, అఖిల, మాధవీలత, గోపాల్‌నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ముదిగుబ్బ: మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ గాయత్రి సూచించారు. మల్లేపల్లిలో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, క్షయ వ్యాధి తదితర వాటిపై డాక్టర్ గాయత్రి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాదేవి, ఎంపీహెచ్ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, పీహెచ్ఎన్ మంజుల, సిబ్బంది రవిశంకర్, అలివేలమ్మ, మీనా, భార్గవి, జ్యోతి, శైలజ, రాజేశ్వరి, పార్వతమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఎన్పీకుంట: మరికొమ్మదిన్నె గ్రామంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ బాలాజీ నాయక్, సీహెచ్ఓ నాగలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ భువనేశ్వరి, ఏఎన్ఎమ్ దేవి, ఆరోగ్యకార్యకర్త విజయ్‌కుమార్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ కలయికకు హాజరైన పూర్వ విద్యార్థులు

ప్రశాంతి నిలయం: వారంతా నాలుగు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్నారు. తర్వాత వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. ఆనాటి స్నేహితులందరూ కలుద్దామని నిర్ణయించారు. అలా కొత్తచెరువు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులందరూ బుధవారం జగరాజుపల్లి మంగళకర విద్యాసంస్థల సమీపంలోని ఓ మామిడి తోటలో 'ఆత్మీయ సమ్మేళనం' పేరిట కలిశారు. ఆనాటి మధురస్మృతులను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సోమశేఖర్‌రెడ్డి, వాసుదేవరావు, ఉమామహేశ్వర, నారాయణరెడ్డి, రవీంద్రారెడ్డి, జనార్దన్‌రెడ్డి, భగవంతప్ప, శివారెడ్డి, రామచంద్ర, క్రిష్టవేణి, శివమ్మ, నారాయణమ్మ, వెంకటరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాఖాపరమైన పనులకు అనుమతివ్వాలి



ఎంపీడీఓకు వినతిపత్రమిస్తున్న ఆర్ఎస్‌కే సిబ్బంది

ఎన్పీకుంట: సచివాలయ సర్వేలను మినహాయించి తమ శాఖాపరమైన పనులు చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని ఆర్ఎస్‌కే సిబ్బంది బుధవారం తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఎంపీడీఓ పార్థసారథికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ శాఖకు సంబంధించి ఈ– పంట నమోదు చేస్తున్నామని, పంట వేసిన భూములే కాకుండా బీడు భూములకు కూడా ఈ– క్రాప్‌లో నమోదు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిపారు. గడువు ముగుస్తుండటంతో పంట నమోదు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారన్నారు. వీటితో పాటు ఎరువుల సరఫరా, పీఎం కిసాన్, అన్నదాతా సుఖీభవ, సాయిల్ శాంపిల్స్, పంట కోత ప్రయోగాలు, పొలం పిలుస్తోంది తదితర సీజనల్ కార్యక్రమాలు ఉన్నాయన్నారు. ఈ సమయంలో తమ కార్యక్రమాలు నిర్వహించేందుకే సమయం సరిపోవట్లేదని వాపోతున్నారు. పీ4, కౌశలం, రేషన్‌కార్డ్, వాట్సాప్ డోర్ టు డోర్ తదితర సర్వేల నుంచి ఆర్ఎస్‌కె సిబ్బందికి మినహాయింపు ఇవ్వాలని వారు కోరారు.

సంక్షిప్త సమాచారం

పిల్లలు ఎత్తుకు తగిన బరువుండాలి

పుట్టపర్తి అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు ఎత్తుకు తగిన బరువు ఉండాలని, వీటిని ప్రతినెలా నమోదు చేయాలని సీడీపీఓ జయంతి, సూపర్‌వైజర్ సుజాత పేర్కొన్నారు. బుధవారం ఎనుములపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ మహా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీడీపీఓ మొక్కలు నాటారు. గర్భిణులకు సీమంతాలు చేశారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

తాడిమర్రి: ప్రాణాంతకమైన ఎయిడ్స్ మహమ్మారి పట్ల అప్రమత్తంగా ఉండాలని చైల్డ్ ఫర్ ఇండియా లింక్ వర్కర్ ఆనంద్ సూచించారు. నిడిగల్లు గ్రామంలో బుధవారం ఆయన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్, గ్రామస్తులతో కలిసి ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఆర్థికసాయం అందజేత

కదిరి అర్బన్: పట్టణంలోని సైదాపురంలో క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళకు బుధవారం హార్ట్ టు హెల్ప్ సంస్థ అధ్యక్షుడు రవినాయక్ దాత స్వప్న సహకారంతో రూ.15 వేల ఆర్థికసాయం అందజేశారు. అలాగే హైదరాబాద్ హెయిర్ డొనేషన్ క్యాన్సర్ పేషెంట్ ఆర్గనైజర్ శివ సహకారంతో ఉచితంగా విగ్గు అందజేశారు.

విధి నిర్వహణలో అశ్రద్ధ వద్దు

ముదిగుబ్బ: విధి నిర్వహణలో అశ్రద్ధ చేయరాదని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ శకుంతల సూచించారు. బుధవారం పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమావేశం నిర్వహించారు. సర్వేలు నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ధర్మవరం అర్బన్: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని లక్ష్మీచెన్నకేశవపురం అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు సురేష్‌నాయక్, మలేరియా అసిస్టెంట్ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని కేతిరెడ్డికాలనీలో బుధవారం ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నిల్వ ఉన్న నీటిలో లార్వాను గుర్తించి నిర్మూలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ సునిత, ఏఎన్ఎం గాయత్రి, ఆశా కార్యకర్తలు అరుణ, లలితమ్మ పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే ప్రభుత్వ లక్ష్యం

రామగిరి: సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీడీఓ బాలకృష్ణుడు, ఎంఈఓ ప్రకాష్‌లు పేర్కొన్నారు. బుధవారం రామగిరిలో నిర్వహించిన 'ఉల్లాస్–అక్షర ఆంధ్ర' కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే 'ఉల్లాస్' కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో వయోజనవిద్య పర్యవేక్షకులు వెంకటరమణ, ఏపీఎం అనసూయమ్మ, ఏపీఓ శంకర్, మహిళాసమాఖ్య అధ్యక్షురాలు సుకన్యతోపాటు సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

మోతాదుకు మించి వాడొద్దు



గంటాపురంలో సూచనలిస్తున్న ఏడీఏ లక్ష్మానాయక్

బత్తలపల్లి: రసాయన ఎరువులు, పురుగుమందులు మోతాదుకు మించి వాడరాదని ధర్మవరం వ్యవసాయ సహాయ సంచాలకుడు (ఏడీఏ) లక్ష్మానాయక్ సూచించారు. బుధవారం సంజీవపురం సచివాలయంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి ఓబిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలాఖరులోగా ఈ–పంట నమోదు పూర్తి చేయాలని రైతు సేవ కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో సాగు చేస్తున్న పలు పంటలకు సంబంధించి యాజమాన్య పద్ధతుల గురించి తెలియజేశారు. అనంతరం గంటాపురంలో 'పొలంబడి' నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసులు, రైతు సేవ కేంద్ర సహాయకులు చరత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణేశ్వరీ పాహిమాం..

సాక్షి బృందం: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. మూడోరోజు బుధవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ముఖ్యంగా అన్నపూర్ణదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలతో ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.



బత్తలపల్లిలోని కొల్లాపురమ్మ ఆలయంలో లలితాదేవి రూపంలో...



ధర్మవరంలోని శ్రీనివాసనగర్‌లో వరాహవతార అలంకరణలో వేంకటేశ్వరస్వామి




ధర్మవరం అర్బన్: అన్నపూర్ణేశ్వరిదేవిగా రామ్‌నగర్ చౌడేశ్వరీదేవి



ధర్మవరం అర్బన్: బ్రహ్మచారిణిదేవి అలంకరణలో టీచర్స్‌కాలనీ సజ్జల కాల్వ చౌడేశ్వరీదేవి



ధర్మవరం అర్బన్: బాలత్రిపుర సుందరిదేవి అలంకరణలో కొత్తపేట పద్మావతి అమ్మవారు



కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీనృసింహావతార అలంకారం



ముదిగుబ్బలో అన్నపూర్ణేశ్వరి అలంకరణలో వాసవీమాత



తలుపులలో గోడంబి, బాదం అలంకరణలో వాసవీమాత



ప్రత్యేక అలంకరణలో సీకేపల్లి మండలం మేడాపురం చౌడేశ్వరీదేవి



కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో అన్నపూర్ణదేవిగా మల్లాలమ్మ



తాడిమర్రి మండలం దాడితోటలో గాయత్రీదేవి అలంకారంలో పెద్దమ్మ



మద్దెలచెరువులో అన్నపూర్ణాదేవిగా మారెమ్మ తల్లి



అమడగూరులో అన్నపూర్ణదేవి రూపంలో చౌడేశ్వరీ మాత



పుట్టపర్తిలో శాకంబరి దేవతగా సత్యమ్మ తల్లి